అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
సోమవారం 23 జనవరి 2023

భీమేశ్వరాలయంలో ఎస్పీ దంపతుల పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న ఎస్పీ దంపతులు

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలం సంతాయిపేట భీమేశ్వర ఆలయంలో ఆదివారం జిల్లా ఎస్పీ శ్రీనివాసరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులకు ఆలయ కమిటీ నిర్వాహకులు, పూజారులు ప్రత్యేక స్వాగతం పలికి గుడిలోకి ఆహ్వానించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి శ్రీనివాస్, ఎస్సై ఆంజనేయులు, వైస్ చైర్మన్ మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం


ఎమ్మెల్సీని సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలో పెద్దవాల్గోట్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన సిద్దిపేట్ ఎమ్మెల్సీ డాక్టర్ ఒంటేరి యాదవరెడ్డిని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, పెద్ద వాల్గోట్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ వడియాల వెంకట నరసింహారెడ్డి లు కలిసి ఘనంగా సన్మానించారు. సన్మానించినవారిలో వడియాల వీరేందర్ రెడ్డి, వడియాల నరసింహారెడ్డి, వడియాల సత్యం రెడ్డి, శనిగారం భాగారెడ్డి, మల్కాపురం సతీష్ రెడ్డి, శేఖర్, నసీర్,శ్రీనివాస్ వంతులు తదితరులు ఉన్నారు.

ప్రత్యేక తరగతులకు.. పస్తులే

- పదో తరగతి విద్యార్థులకు ప్రారంభమైన స్పెషల్‌క్లాస్‌లు
- ఉదయం, సాయంత్ర వేళల్లో రెండు గంటల పాటు అదనపు తరగతులు
- స్నాక్స్ లేక అర్థాకలితో అలమటిస్తున్న పిల్లలు
- దాతల కోసం విద్యాశాఖాధికారుల ఎదురుచూపులు

నవతెలంగాణ-లింగంపేట్

ప్రభుత్వ స్కూళ్లల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభించింది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం జిల్లాల్లో ప్రభుత్వ స్కూళ్లల్లో పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాస్‌లు కొనసాగుతున్నాయి. అయితే సాయంత్రం వేళ ఆకలితో విద్యార్థులు అలమటిస్తున్నారు. ఉదయం వేళల్లో సైతం ఇంట్లో వంటకాలేని పరిస్థితుల్లో పస్తులతోనే ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. దీంతో చదువు మీద దృష్టి పెట్టలేక పోతున్నారు. వారికి ఉదయం, సాయంత్రం వేళల్లో స్నాక్స్ (అల్పాహారం) ఏర్పాటు చేస్తే వారు చదువుపైనే దృష్టిపెట్టే అవకాశం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు. అయితే స్కూళ్లకు వచ్చే గ్రాంట్స్ ఇతరాత్ర ఖర్చులకు సైతం సరిపోక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం స్నాక్స్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఎస్ఎంసీ కమిటీలు డిమాండ్ చేస్తున్నాయి.

కామారెడ్డి జిల్లాలో 22 మండలాల పరిధిలో 1257 పాఠశాలలున్నాయి. 11,889 మంది పదోతరగతి విద్యార్థులున్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు ప్రారంభించారు. ఉదయం 8:30 నుండి 9:30 గంటల వరకు, సాయంత్రం 4:45 నుండి ఐదు 5:45 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఉన్నత పాఠశాలకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయా ఉన్నత పాఠశాలలో ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తు న్నారు. ప్రతి ఆదివారం వారంతపు పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల సామర్థ్యం పరిశీలిస్తూ అందుకనుగుణంగా బోధనా పద్ధతులు అవలంభిం చాలని ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి.


ప్రత్యేక క్లాసులో చదువుకుంటున్న విద్యార్థులు

అర్థాకలితో విద్యార్థులు..

స్పెషల్ క్లాసులు ఉండటంతో ఉదయం వేళ ఇంట్లో వంట కాని సమయంలో పలువురు విద్యార్థులు పస్తులతోనే స్కూల్‌కు వస్తున్నారు. దీంతో పాటు సాయంత్రం వేళ సైతం ఆకలితో అలమటిస్తున్నారు. గతంలో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో స్నాక్స్ ఏర్పాట్లు చేసింది. గతేడాది దాతల సాయం కోరింది. అయితే ఈ సారి ఇప్పటి వరకు స్నాక్స్ విషయమై ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తూ.. చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ప్రభుత్వం స్పందించి స్కూళ్లల్లో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దాతలు ముందుకు రావాలి

జయపాల్‌రెడ్డి. భవానిపేట్ జడ్పీహెచ్ఎస్

పదో తరగతి పరీక్షలు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాము. సాయంత్రం వేళ విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు కోసం దాతలు ముందుకు రావాలి. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నప్పటికీ విద్యార్థులు అల్పాహారం అందక ఇబ్బందులు పడుతున్నారు.

వచ్చిన గ్రాంట్ సరిపోవడం లేదు

చింతల సంతోష్ కుమార్ గుప్తా.
ఎస్ఎంసి కమిటీ చైర్మన్. లింగంపేట్

బాలికల ఉన్నత పాఠశాలకు ఏడాదికి రూ.32 వేల గ్రాంట్ వస్తుంది. ఆ నిధులు సైతం ఖర్చులకు సరిపోవడం లేదు. అప్పులు చేయాల్సి వస్తుంది. పదో తరగతి విద్యార్థులకు ఉదయం అల్పాహారం ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి.

ఎలాంటి ఆదేశాలు రాలేవు

రాజు. జిల్లా విద్యాధికారి

విద్యార్థులకు అల్పాహారం అందించిన విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు. ప్రధానోపాధ్యాయులు స్థానికంగా ఉండే దాతలకు సంప్రదించాలి. దాతల సహకారంతో అల్పాహారం అందించాలి.

అమ్మ ఎక్కడ..

సంగారెడ్డి జిల్లా కల్హెరా మండలం పోమ్య నాయక్ తండాకు చెందిన దంపతులు కామారెడ్డిజిల్లా రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామ శివారులో చెరుకు తోటలో కూలి పని చేస్తున్నారు. చెరుకు కొట్టే పనిలో నిమగ్నమైన వారు.. చెరుకు గడల సాయంతో చిన్న డేరా లా ఏర్పాటు చేసి.. తమ 7 నెలల చిన్నారిని అక్కడ ఉంచారు. వారి తల్లి తండ్రులు పనిలో నిమగ్నమవడంతో అక్కడ ఎవరూ లేక ఆ చిన్నారి బిక్కుబిక్కుమంటూ దీనంగా చూస్తోంది. వలస జీవుల బతుకు చిత్రానికి ఈ దృశ్యమే నిదర్శనం.

ఫొటో : జూపల్లి తిరుపతి. నవతెలంగాణ, రామారెడ్డి.


చెరుకు తోటలో బిక్కుబిక్కుమంటూ దీనంగా చూస్తున్న చిన్నారి

పోడు భూములకు పట్టాలు ఇవ్వక పోతే
జాతీయ రహదారిని దిగ్బంధిస్తాం

- సీపీఐ(ఎం)

నవతెలంగాణ-జుక్కల్

పోడు భూములకు పట్టాలు ఇవ్వకపోతే రైతులతో కలిసి జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని సీపీఐ(ఎం) నాయకులు సురేశ్‌గొండ హెచ్చరించారు. అదే విధంగా ఏక కాలంలో లక్ష రూపాయల రైతు9ల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఖండేబల్లూర్‌లో పార్టీ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు రైతులకు పట్టాలిస్తామని దరఖాస్తుల పేరు మీద, సర్వేల పేరుతో కాలయాపన చేయడం సరైందికాదని అన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో కమిటీలు వేసి సర్వేలు చేపట్టినా.. నేటికి పట్టాలు ఇవ్వక పోవడం ఎంత వరకు సమంజసమని అన్నారు. పట్టాలు లేక పాస్‌బుక్కులు రాక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదని, ధరణి పట్టా లుంటే రుణాలు ఇస్తామని బ్యాంకు అధికారులు చెబుతున్నారని అన్నారు. పోడు పట్టాలు ఇవ్వకపోతే ఫిబ్రవరి నెల మొదటి వారంలో జుక్కల్ చౌరస్తా జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు మోతీరాం నాయక్, మాజీ ఎంపిటిసి కే.రాములు, హుస్సేన్, హైమద్, మైబుబ్, విఠల్, కోలనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న రైతులు, నాయకులు

ఏసీడీ చార్జీల ఎఫెక్ట్..
విద్యుత్ సిబ్బంది నిర్బంధం


విద్యుత్ సిబ్బందిని బంధించిన గ్రామస్తులు

నవతెలంగాణ-తాడ్వాయి

ఏసీడీ, సర్ చార్జెస్, ఫిక్స్ చార్జెస్ పేరుతో అధిక కరెంట్ బిల్లు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలోని కన్కల్ గ్రామస్తులు ఆదివారం విద్యుత్ సిబ్బందిని నిర్బంధించారు. లైన్‌మెన్‌తో పాటు లైన్ ఇన్స్‌పెక్టర్, బిల్ కలెక్టర్‌ను గ్రామంలోని వృద్ధుల సంఘం భవనంలో బంధించారు. ఏసీడీ చార్జీలు అధికంగా ఎందుకు చెల్లించాలని నిలదీశారు. అధిక చార్జీలతో ఇస్తున్న కరెంట్ బిల్లు తాము కట్టబోమని అన్నారు. ఏసీడీ చార్జీలు ఎందుకు వేస్తున్నారని ఏఈని ఫోన్‌లో సంప్రదించగా.. పై నుంచి వస్తున్నట్టు తెలిపారు. చివరకు సిబ్బందిని విడుదల చేశారు.

చిన్ననాటి మిత్రునికి ఆర్థిక సాయం


మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

నవతెలంగాణ-లింగంపేట్

కిడ్నీ సమస్యతో దీర్ఘకాలికంగా బాధపడుతున్న చిన్ననాటి మిత్రునికి.. తోటి మిత్రులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. లింగంపేట్ మండలంలోని కొర్పుల్ గ్రామానికి చెందిన చిన్న సాయిలు, లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2002 పదో తరగతి పూర్తి చేసుకున్నాడు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఇంటికి పరిమితమైయ్యాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆసుపత్రిలో చూపించుకోవడానికి చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో తోటి మిత్రుని పరిస్థితి గమనించి పూర్వ విద్యార్థులు కలిసి తమ వంతుగా ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.45,000 వారి ఇంటివద్దకు ఆదివారం వెళ్లి నగదు రూపంలో సహాయం చేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయనకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భూపతి, కాశీరాం, రంజిత్ రెడ్డి, సుదర్శన్, బలరాం, రాజు, శంకర్, నవీన్, ఉన్నారు.

పార్టీఇన్‌చార్జిని కలిసిన మదన్‌మోహన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తెలంగాణ ఏఐసిసి ఇన్‌చార్జి మాణిక్‌రావ్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ రావు ఆదివారం గాంధీ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో జరగబోయే కాంగ్రెస్ పార్టీ హత్ సే హత్ జోడో యాత్ర, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించవలసిన వ్యూహాలు, బూత్ స్థాయి కార్యకర్తలతో కమ్యూనికేషన్ వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చినట్లు మదన్‌మోహన్ తెలిపారు.

కుల, మత రాజకీయాలతో
ప్రజల్లో విద్వేషాలు నింపొద్దు

- ఎంపీ అరవింద్‌పై మంత్రి వేముల ఫైర్
- నిధులు తీసుకురావడంలో, అభివృద్ధి చేయించడంలో పోటీపడాలని హితవు

నవతెలంగాణ-ఏర్గట్ల

కుల, మత రాజకీయాలతో ప్రజల్లో విద్వేషాలు నింపొద్దని ఎంపీ అరవింద్‌పై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో, గ్రామాల అభివృద్ధి చేయించడంలో పోటీపడాలని హితవు పలికారు. నోటికొచ్చినట్టు వాగుతూ కుల, మత రాజకీయాలతో ప్రజల్లో విద్వేషాలు నింపి ఓట్లు దండుకోవాలనుకునే ఆలోచనలు మానుకోవాలని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. ఏర్గట్ల మండలంలోని తాళ్ళ రాంపూర్, గుమ్మిర్యాల్, దోంచంద గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆదివారం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. తాళ్లరాంపూర్ గ్రామంలో 50 లక్షల రూపాయలతో నిర్మించబోయే మల్లన్న దేవాలయానికి, గుమ్మిర్యాల్ గ్రామంలో గుమ్మిర్యాల్ నుండి కొండాపూర్ వరకు 1 కోటి 50 లక్షల రూపాయలతో రోడ్డు పునరుద్ధరణ పనులకు,దోంచంద గ్రామంలో దోంచంద నుండి గుమ్మిర్యాల్ గ్రామం వరకు 60 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు, దోంచంద నుండి తడపాకల్ వరకు 3 కోట్లతో బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలను పసుపు బోర్డు పేరిట మోసం చేసి ఓట్లు దండుకున్నావని, మరోసారి నీ చేతిలో మోసపోవడానికి వారు సిద్ధంగా లేరని అన్నారు. రాబోవు ఎన్నికల్లో కచ్చితంగా నీకు ప్రజలే తగిన బుద్ధి చెపుతారని స్పష్టంచేశారు. సీఎం రిలీఫ్ ఫండ్‌లో భాగంగా నా నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు 10 వేల మందికి 40 కోట్ల రూపాయలు ఇప్పించానని, నీవు నీ ప్రధానమంత్రి నిధి కింద ఎన్నికోట్ల రూపాయలు ఇప్పించావో తెలపాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, సర్పంచ్‌లు గుల్లే లావణ్య గంగాధర్, గద్దె రాధ గంగారాం, భానుప్రసాద్, పత్తిరెడ్డి ప్రకాష్, మంజుల బాలాజీ గౌడ్, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి,కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, ఉపసర్పంచ్లు క్యాతం దేవేంధర్, సోమిరెడ్డి శ్రీనివాస్, సంజీవ్ యాదవ్, లోలం అశోక్, కుర్మ శేఖర్, నాయకులు బోనగిరి రమేష్, అంజిరెడ్డి, అశోక్ యాదవ్, క్యాతం సుభాష్, ముక్కెర దేవన్న, ఆశిరెడ్డి శ్రీనివాస్, నాగిరెడ్డి రాజేందర్ రెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


దోంచందలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

గంజాయి అమ్మినా, పీల్చినా కేసు నమోదు చేయాలి : మంత్రి


ఎస్ఐకి సూచనలిస్తున్న మంత్రి వేముల

మండలంలో ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేసి ప్రజలకు అమ్మినా, ఎవరైనా కొనుగోలు చేసి పీల్చినా వారిపై చర్యలు తీసుకోవాలని, వారిపై కేసులు నమోదు చేయాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎస్సై రాజుకు ఆదేశించారు. గంజాయి వల్ల యువత నాశనం అవడమే గాక కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని, మండలంలో గంజాయి అరికట్టడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేసుకొని వారిని పట్టుకోవాలని, ఇందులో ఎంతటివారైనా ఉపేక్షించవద్దని ఎస్ఐ రాజుకు సూచించారు.

ఎల్లారెడ్డి బస్టాండ్ కూల్చివేత

- నూతన హంగులతో కొత్త బస్టాండ్ : మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ కూల్చివేత ఆదివారం చేపట్టారు. మున్సిపల్ నిధులు రూ.3 కోట్లతో నూతన బస్టాండ్‌ను నిర్మించనున్న విషయం విధితమే. కాగా కూల్చివేత పనులను మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, కమిషనర్ జీవన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ప్రస్తుత బస్టాండ్ శిథిలవస్తులు ఉన్నందున నూతన బస్టాండ్ కోసం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ నిధుల నుండి మూడు కోట్లతో అత్యాధునిక హంగులతో బస్టాండ్ నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. నూతన బస్టాండ్‌లో ఏడు ప్లాట్ ఫాంలు నిర్మించనున్నట్టు తెలిపారు. ప్రయాణీకులకు కావాల్సిన సదుపాయాలన్నీ కల్పించనున్నట్టు తెలిపారు. ఐదు నెలల్లో నూతన బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయనున్నామని, అంత వరకు తాత్కాలికంగా ప్రయాణికుల కోసం మున్సిపాలిటీ తరఫున బస్సులు నిలిపే చోట టెంట్ వేయనున్నట్టు తెలిపారు. అలాగే వేసవి కాలం వస్తున్నందున మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తామని ఐదు మాసాల్లో బస్టాండు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ రాము, ఎరుకల సాయిలు, కోఆప్షన్ మెంబర్స్ కిషన్, ముజ్జు, ఎల్లారెడ్డి టౌన్ బిఆర్ ఎస్ అధ్యక్షుడు అధిములం సతీష్, ఎల్లారెడ్డి బిఆర్ఎస్ అధికార ప్రతినిధి రామప్ప, బిఆర్ఎస్ నాయకులు శ్రవణ్ కుమార్ రాజు, లింగం ,షరీఫ్ , నాగం సురేందర్, సాయిరాములు ,ఎస్ శ్రీనివాస్ మున్సిపల్ట్ సిబ్బంది మరియు ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు..


బస్టాండ్‌ను కూల్చివేస్తున్న బుల్డోజర్

చోరీకి యత్నం.. పట్టుకున్న గ్రామస్తులు

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

నవతెలంగాణ-ధర్పల్లి



చోరీలకు పాల్పడుతున్న దుండగుడిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మండలంలోని రామడుగు ప్రాజెక్టు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామంలోని సైకిల్ టేక్సీ గంగాధర్ అనే వ్యక్తి తన భార్య ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి తీసుకెళ్లాడు. గమనించిన అదేగ్రామానికి చెందిన బండ ప్రశాంత్ అనే యువకుడు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి బీరువ పగులగొట్టి అందులోని సమాను చిందరవందరగా పడేయడంతో శబ్దం రావడంతో గమనించిన గ్రామస్తులు దుండగుడిని పట్టుకొని చితకబాది పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని పోలీస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో కొన్ని చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు.

జుక్కల్ ఎస్సైకి సన్మానం


ఎస్ఐకి స్వీటు తినిపిస్తున్న నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

ఇటీవల బాధ్యతలు జుక్కల్ ఎస్ఐ మురళిని బీఆర్ఎస్ నాయకులు శివాజీ పటేల్, బస్వాపూర్ సర్పంచ్ రవిపటేల్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని, సమస్యలుంటే నేరుగా పీఎస్ కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
2
సోమవారం 23 జనవరి 2023

ఆకు ఒకటే.. రంగులు మూడు



నవతెలంగాణ-బోధన్

మొక్కలలో ఎన్నోరకాలు ఉన్న క్రోటన్ మొక్క తీరే వేరు.. ఈ మొక్కలు కొన్ని పెద్దగా, చిన్నగా పెరిగి దాని ఆకులు మాత్రం చూపరులను ఆకట్టుకుంటున్నాయి. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట (జేసీ)లో పెరిగిన క్రోటన్ మొక్క ఆకు మూడు రంగులతో ఆకట్టుకుంటుంది. సాధారణంగా పచ్చని వర్ణంలో ఉండే ఈ ఆకుపై మధ్యలో గులాబి రంగు, దాని పక్కన బ్రౌన్ రంగు ఉండి అలరిస్తుంది.

పుష్కర రోడ్డు.. రాకపోకలు బంద్



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం వద్ద బ్రిడ్జి నుంచి పుష్కర ఘాట్ల వరకు వెళ్లే ప్రధాన రోడ్డు కూలిపోవడంతో భక్తులకు తీవ్ర అవస్థలు కలుగుతున్నాయి. పుష్కరాల సమయంలో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టగా పగుళ్లు ఏర్పడి పూర్తిగా ధ్వంసం అయింది. నాసిరకంతో పనులు చేపట్టారని కాంట్రాక్టర్‌పై ప్రజలు మండిపడుతున్నారు. బ్రిడ్జి పైనుంచి నేరుగా పుష్కర ఘాటుకు వెళ్లడానికి వాహనాలకు సౌకర్యంగా ఉండేది. రోడ్డు ధ్వంసం కావడంతో భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆడపిల్లలను కాపాడుదాం

- నేటికీ కొనసాగుతున్న వివక్ష
- రేపు జాతీయ బాలికల దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

ఆడ పిల్లలపై ఆది నుంచి వివక్ష కొనసాగుతూనే ఉంది. మగవాళ్ళతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న వారంటే చులకన భావనే కనబడుతున్నది. పురుషాధిత్య ప్రపంచంలో ఆడపిల్లలనే భారంగా భావిస్తుండగా రోజురోజుకు వారి సంఖ్య తగ్గిపోతున్నది. ఇకనైనా ఈ దృక్పథం మారకపోతే భవిష్యత్తులో దారుణంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంరక్షణ కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్న ప్రజల్లో మార్పు రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో నిరక్షరాస్యత, అవగాహన లోపం పెండ్లిచేసి బరువు దించుకోవాలన్నా ఉద్దేశంతో బాల్య వివాహాలు చేస్తున్నారు. ఆడపిల్లలను చదివించడంలోనూ వివక్ష చూపుతున్నారు. ఈనెల 24 జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణ ప్రత్యేక కథనం....

దుర్మార్గపు ఆలోచనలతో.. .

పెళ్లయి అత్తారింట్లో అడుగుపెట్టిన అమ్మాయి భవిష్యత్తు కోసం ఎన్నో కలలు కంటుంది. అమ్మ అని పిలిపించుకోవడానికి మాతృత్వపు మమకారాన్ని ఆస్వాదించేందుకు ఆరాటపడుతుంది. గర్భం దాల్చగానే కుటుంబ సభ్యులంతా ఎంతో సంతోషంతో పుట్టబోయే బిడ్డ కోసం కలలు కనేవారు. ఇప్పుడు పరిస్థితులు తలకిందులు అయ్యాయి. గర్భం దాల్చిన మూడు నెలలు తిరగకముందే కడుపులో పెరిగే శిశువు ఆడ మగ తెలుసుకోవాలని దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్నారు. డబ్బుల కోసం లింగ నిర్ధారణ చేసే వైద్యులు ఉండడంతో ఆడ శిశువును కడుపులోనే అంతం చేస్తున్నారు. కడుపులో పెరుగుతున్నది ఆడ బిడ్డని తెలిస్తే చాలు చాలామంది అబార్షన్‌కు ముగ్గు చూపుతున్నారు.. బిడ్డ కోసం కలలు కన్న ఆ తల్లికి కన్నీళ్లే మిగులుతున్నాయి. మగపిల్లాడే వంశోద్ధారకుడు అని భావనతో చాలా కుటుంబాల్లో ఈ తంతు కొనసాగుతుంది. ఆడపిల్ల భారం అనే భావనతో కొందరు మొదటి కాన్పులో మరికొందరు రెండో కాన్పులో అబార్షన్లు చేయించుకుంటున్నారు. దీంతో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది. ఆడపిల్లలు భారం అనుకోవడం సరికాదు.. మగవారితో సమాన అవకాశాలు కల్పిస్తే ఆడపిల్లలు అన్నింటా రాణిస్తున్నారు. ఇప్పటికీ విద్య ఉద్యోగాల్లో ఆడపిల్లలు దూసుకుపోతున్నారు. వారసుడు మగ పిల్లవాడనే భ్రమలు వీడాలి. ఆడపిల్ల కూడా వారసురాలే ఆడపిల్లలు ఉంటేనే భవిష్యత్తు ఉంటుంది..



జనాభా లెక్కల ప్రకారం...

గత కొన్ని సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం వెలువడించిన నో యువర్ డిస్టిక్ ప్లాన్ యువర్ డిస్ట్రిక్ట్ రిపోర్ట్ లో జనాభా నిష్పత్తి వివరాల ప్రకారం ఆడపిల్లల సంఖ్య భారీగా తగ్గింది. జిల్లాలో జనాభా ఆడవారు అగ్రభాగాన ఉంటే గత కొన్ని సంవత్సరాలుగా ఆడపిల్లల సంఖ్య భారీగా తగ్గింది. మొత్తం జనాభాలో ఆడవారి సంఖ్య ఎక్కువగా ఉండగా పిల్లల విషయంలో తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తుంది. మొత్తం జనాభాలు ఆడవాళ్లు 20,847 ఉండగా గత ఆరు ఏడు సంవత్సరాలుగా ఆడపిల్లలే4,440 మంది తక్కువగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాల్లో గత జనవరి నుండి డిసెంబర్ వరకు బాలుర కంటే బాలికల సంఖ్య తక్కువగా ఉన్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

లింగ వివక్ష చూపడం సరికాదు..



సృష్టికి మూలం ఆడది అంటున్నారు. ఆడపిల్ల అన్ని రంగాలలో రాణిస్తున్న ఇంకా వివక్ష చూపడం అన్యాయం. మహిళలకు రాజ్యాంగం ఎన్నో హక్కులు కల్పించింది. ఆడపిల్ల అని అబార్షన్లు చేయించు కోవడం మంచిది కాదు.

పి.రాకేష్ రెడ్డి, వ్యాపారవేత్త, అంకాపూర్

చిన్నచూపు చూసే పద్ధతి మారాలి



ఆడపిల్లలు చదువులో ముందున్నారు. ఏ రంగంలోనైనా ఆడపిల్లలే ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారు. అన్ని రంగాల్లో దూసుకు పోతున్నారు. ఇంకా ఆడపిల్లలపై వివక్ష చూపడం ఏంటి? ఆడవాళ్లు మగవారి కన్నా ఏమీ తీసిపోరు. ఆడపిల్ల అన్న చిన్న చూపు చూసే పద్దతి మారాలి..

సురేష్ రెడ్డి, వ్యాపారి, అంకాపూర్

సిరి హాస్పిటల్ వారి మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు చేస్తున్న సిరిఆస్పత్రి దాక్టర్లు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ వినాయక రెసిడెన్సి ఎదురుగా గల సిరి నర్సింగ్ హోమ్ వారు ఆదివారం 22వ వార్డులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లింగారెడ్డి, శిరీష రెడ్డి, డి శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు, మంత్రి సహకారంతో అభివృద్ధి



జీపీ పాలకవర్గాన్ని సన్మానించిన సిబ్బంది

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గ్రామ పంచాయతీ పాలకవర్గానికి అన్ని విధాలుగా సహకరించిన గ్రామస్తులకు సర్పంచ్ సక్కరం అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులుగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా సర్పంచ్ అశోక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పంచాయితీ పాలక వర్గానికి అన్ని విధాలుగా సహకరించిన గ్రామ ప్రజలకు, నాయకులకు, శ్రేయోభిలాషులకు ప్రతేక ధన్యవాదలు తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంతి రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచితోపాటు వార్డు సభ్యులను పంచాయతీ సిబ్బంది పూలమాలలతో సత్కరించారు.

ఎమ్మెల్యేను కలిసిన దుప్య తండా వాసులు



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న దుప్యతండావాసులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని ధూప్య తాండ గ్రామస్తులు తమకు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఆదివారం ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తొందర్లోనే మంజూరు చేస్తానని హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మహేందర్, మోహన్ నాయక్, గ్రామ సర్పంచ్ పద్మమదన్‌లాల్, దేవేందర్, మోహన్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన చర్యలను ఖండిస్తున్నామని చర్యలను ఖండిస్తున్నామని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శలు బాలయ్య, రాజన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 317 జీవోపై బాధిత ఉపాధ్యాయులు, భార్యాభర్తలు చంటి పిల్లలతో వచ్చి తమ గోడును చెప్పుకోవడానికి అనుమతి లేదని పోలీసులు, సెలవు పెట్టకుండా ఎలా వస్తారని డీఎస్సీ టీఎస్ బెదిరింపులకు గురి చేయడం అమానుషమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను మీరు రౌడీలా అని అనడం చదువు నేర్పి ఒక ఐఏఎస్‌గా తీర్చిదిద్దిన తన గురువులను అవమానించడమే అని డిటిఎఫ్ భావిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల మనసును గాయం చేసేలా మాట్లాడిన దేవసేన మేడంఇకనైనా పద్ధతి మార్చుకొని 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని, విడిపోయిన కుటుంబాలను ఒకటి చేయాలని, స్థానికతను పునరుద్ధ రించాలని కోరారు. స్పౌజ్ బదిలీల ఉపాధ్యాయులు, 317 జీఓ బాధిత ఉపాధ్యాయులు ప్రగతి భవన్‌కు వెళ్లేందుకు వివిధ జిల్లాల నుండి బయలుదేరిన ఉపాధ్యా యులను అరెస్టు చేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వారని విడుదల చేయాలని కోరారు.

25 వరకు ఆకృతిలో ప్రదర్శన మేళా

కిసాన్ గ్రూప్ చైర్మన్ ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 25వరకు మహా నగరాలకు దీటుగా ఆకృతిలో ప్రదర్శనమేళా ఉంటుందని, ఇందుకు సినీ తారలు హాజరవుతున్నారని కిసాన్ గ్రూప్ చైర్మన్ ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, డైరెక్టర్ ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నిజామాబాద్ నగరంలో కిసాన్ గ్రూప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఆకృతి షోరూం ప్రారంభించి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. మహిళల అభిరుచులకు అనుగుణంగా పట్టుచీరలను అందిస్తున్నామన్నారు. మాస్టర్ వీవర్ ద్వారా ఈనెల 23 24 25న ఆకృతి షో రూమ్ లో ప్రదర్శన ఉంటుందన్నారు. దీని ప్రారంభానికి ప్రముఖ సినీనటి అనసూయ భరద్వాజ వస్తున్నారని తెలిపారు. మాస్టర్ వీవర్స్ నుంచి గతంలో కన్నా ఇప్పుడు ఎక్కువ రేంజ్ తామర, కీమయ, విభవారి, అనే పేరుతో పట్టు చీరలు మీ అందరి ముందుకు తీసుకు వస్తున్నామని అన్నారు. ఈ మాస్టర్ వీవర్ శారీ షోలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కావున సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ధన్‌పాల్

లైంగిక వేధింపులకు పాల్పడుతున్న

భారత రెజ్లింగ్ సమైక్య అధ్యక్షుడిని తొలగించాలి

ఐద్వా డిమాండ్

బ్రిజ్‌భూషణ్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో భారత మహిళా రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరన్ ను అధ్యక్ష పదవి నుండి తొలగించాలని, స్పష్టంగా విచారణ జరపాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఆదివారం నిజామాబాద్ నగరంలోని బ్రిజ్‌భూషన్ శరణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.. భారత మహిళ రెజర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బ్రిజ్ భూషణ్ శరన్ పై చర్యలు చేపట్టకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఐద్వా మహిళా సంఘం బీజేపీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. వెంటనే ప్రభుత్వం నిర్ణయం తీసుకొని చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రజియా బేగం, నగర నాయకులు యశోద, నాయకులు పర్వీన్ బేగం బుర్క లక్ష్మి, మమత, రమ, కమ్మర్ బేగం, మస్తాన్‌బి తదితరులు పాల్గొన్నారు.



బ్రిజ్‌భూషణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఐద్వా నాయకులు

హైకోర్టు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హైకోర్ట్ జడ్జి వాదోపవాదనలు విన్న తర్వాత ఇన్ సర్వీస్‌లో ఉన్న అభ్యర్థులను రెండు సెంటీమీటర్ల తేడా వరకు, నార్మల్ అభ్యర్థులు 1.5 సెంటీమీటర్ తేడా ఉన్న వాళ్లందరికీ మాన్యువల్ గేజ్ తో కొలిచి మెయిన్స్ కి అవకాశం కల్పించాలని హైకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాసుకోండి విఘ్నేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నిర్వహించిన ఈవెంట్స్‌లో హైట్‌లో డిస్ క్వాలిఫై అయిన అభ్యర్థులకు డిజిటల్ మీటర్లో వన్ సెంటీమీటర్ వరకు తేడా చూపిస్తుందని, దానివల్ల అభ్యర్థులకు అన్యాయం జరిగిందని అభ్యర్థులు కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. దీనిపై హైకోర్టు జడ్జిమెంట్ ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

1న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) ప్రచార పోస్టర్లను నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికులకు మెరుగైన సంక్షేమ పథకాల సాధనకు ఈనెల 20 నుంచి 30 వరకు ప్రచార క్యాంపెయిన్, ఫిబ్రవరి 1 న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు కార్మిక శాఖ లేబర్ కార్డులు ఇవ్వాలని అన్నారు. పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరించాలన్నారు. పెళ్లి కానుక, డెలివరీ పథకాన్ని 30 వేల నుండి లక్ష రూపాయల వరకు పెంచాలని అన్నారు. సహజ మరణానికి లక్ష నుంచి 5 లక్షల రూపాయలకి, ప్రమాదవశాత్తు మరణించిన వారికి ఆరు లక్షలను 10 లక్షలకు పెంచి ఇవ్వాలని అన్నారు. ఇటీవల కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికులకు అందరికీ మోటార్ బైక్ లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.రాజేశ్వర్, సహాయ కార్యదర్శి బి.మల్లేష్, జిల్లా నాయకులు కిరణ్, తారాచంద్, గంగారం, మల్లయ్య, బాలరాజు, విటల్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజు సర్వసమాజ్ అధ్యక్షునిగా, బీజేవైయం పట్టణ ప్రధాన కార్యదర్శి పసుపుల సాయికుమార్ పెర్కిట్ సర్వ సమాజ్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు సన్మానించారు. ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో పట్టు శాలువాలతో, పూలమాలలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-రెంజల్

మైనారిటీ గురుకుల పాఠశాలలో దరఖాస్తులు చేసుకునే నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు సీట్లు ఖాళీగా ఉన్నాయని మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు జలీల్ బేగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జక్రాన్‌పల్లి మండలం మునిపెల్లి మైనారిటీ పాఠశాలలో 2022- 23 కు గాను ఐదవ తరగతిలో 80 సీట్లు, ఆరవ తరగతిలో 26 సీట్లు, ఏడవ తరగతిలో 16 సీట్లు, 8వ తరగతిలో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల నిరుపేద విద్యార్థిని విద్యార్థులు తమ ఆధార్ కార్డు, బోనఫైడ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సంప్రదిస్తే వారిని నేరుగా పాఠశాలలో చేర్చుకుంటామని పేర్కొన్నారు. ఇటీవల మండలంలోని నీల గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు విద్యార్థులను నిజామాబాద్ మైనార్టీ గురుకుల పాఠశాలలో చేర్పించామని తెపారు. ఆసక్తిగల విద్యార్థి తల్లిదండ్రులు 99499 40582 కు సంప్రదిస్తే తమ పిల్లలను మైనారిటీ పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల7,8,9తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా మందమర్రిలో జరిగిన 44వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ మెన్ హ్యాండ్ బాల్ పోటీల్లో నిజామాబాదు జిల్లాకు చెందిన సాయికుమార్ జాతీయస్థాయి సీనియర్ మెన్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.పవన్ కుమార్ తెలియజేశారని నిజామాబాదు జిల్లా హ్యాండ్ బాల్ అడక్ కమిటీ చైర్మన్ గంగా మోహన్ చక్రు గారు, కన్వీనర్ పింజ సురేందర్ ఆదివారం తెలిపారు. 44వ జాతీయ స్థాయి జూనియర్ మెన్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్ తమిళనాడు రాష్ట్రంలో ఈనెల 26, 27, 28, 29 తేదీల్లో జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని నిజామాబాద్ జిల్లా అడక్ కమిటీ కన్వీనర్ పింజ సురేందర్, కో- కన్వీనర్ గట్టడి రాజేష్ అభినందించారు. క్రీడాకారుడి ఎంపిక పట్ల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు టి. విద్యాసాగర్ రెడ్డి, అప్పల గణేష్, సురేష్, ఎస్ఐఎస్ హ్యాండ్ బాల్ కోచ్ రాజేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.

తెడ్డు పోశెట్టిని పరామర్శించిన మైనంపల్లి



తెడ్డుపోశెట్టిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

నవతెలంగాణ-నవీపేట్

మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ తెడ్డు పోశెట్టిని ఆదివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరామర్శించారు. పోశెట్టి మాతృమూర్తి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెడ్డు పోశెట్టి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

27 నుంచి జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి (18వ వార్షికోత్సవం) ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శేషశాయి చార్యులు ఆదివారం తెలిపారు. ఈ నెల 27 నుంచి 29 వరకు జాతర ఆలయ ఉత్సవాలు కొనసాగుతాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. చివరి రోజున స్వామి వారికి నాగవేల్లి చక్రస్నానం, పూర్ణాహుతి పూజాకార్యక్రమలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ చైర్మన్ దేశ నర్సయ్య, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షులుగా శ్రీరామ్ నియామకం పట్ల హర్షం



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ ఎడపల్లి

ఎడపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా రెండోసారి ఎడపల్లికి చెందిన దేరాడి శ్రీరామ్ నియామకం కావడం పట్ల శ్రీ లక్ష్మీనర్సింహస్వామీ తాజా మాజీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని జాన్కంపేట్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపాన సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల బీఆర్ఎస్ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, పార్టీ కార్యకర్తలు శ్రీరామ్‌ను అభినందించారు. రెండోసారి కూడా శ్రీరామ్ అధ్యక్షులు కావాలని తాను కోరుకున్నట్టే నియామకం కావడం పట్ల సంతోషంగా ఉందని విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కే శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, సర్పంచులు ఆకుల మాధవి శ్రీనివాస్, హనుమాన్లు, విజయ్ కుమార్, పాల్థ భాస్కర్ రెడ్డి, కోల ఇంద్రకరణ్, పీస్క గంగా ప్రసాద్, అమానుల్లా షరీఫ్, బీఆర్ఎస్ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మాణిక్యాల సురేష్ గౌడ్, మంగళ్ పాడ్ బి ఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు హసేన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదర్శ పాఠశాలలో డ్రాయింగ్ పోటీలు

నవతెలంగాణ-రెంజల్

ప్రధానమంత్రి పిలుపు మేరకు ఎంపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షులు చుక్క రాజుగౌడ్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పిటిసి, మండల ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలు, బూత్ కమిటీ సభ్యులు, శక్తి కేంద్రం సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

రెడ్డి సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక



అధ్యక్షులు బాల్‌రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జిల్లెల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వంగేటి పెద్ద నర్సారెడ్డి, మన్నే గంగారెడ్డి, కార్యదర్శి ఏనుగు సురేందర్ రెడ్డి, కోశాధికారి కుంట నర్సారెడ్డిలను ఎన్నుకున్నారు. వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా కుంట సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు బద్దం రాజిరెడ్డి, కార్యదర్శి ఏనుగు భాస్కర్ రెడ్డి, కోశాధికారి వంగేటి నర్సారెడ్డి, సలహాదారులు వంగెటి నర్సారెడ్డి, ఏనుగు బాపురెడ్డి, నాగర్తి బాల్ రెడ్డి, కుంట గంగారెడ్డి, తిరుపరి భీమ్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు జిల్లెల బాల్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రెడ్డి సంక్షేమ సంఘాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇక ప్రతి బుధవారం స్వచ్ఛ ఆర్మూర్

నవతెలంగాణ-ఆర్మూర్

ఇక నుంచి ప్రతి బుధవారం స్వచ్ఛ ఆర్మూర్ కార్యాక్రమాన్ని విధిగా నిర్వహించాలని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెం.12 లోని మినిస్టర్ క్వార్టర్స్ లో ఆదివారం పట్టణ మునిసిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు, ప్రధానంగా కంటి వెలుగు కార్యక్రమం అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో లో ప్రతీ బుధవారం సాయంత్రం అంగడి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఉదయమే పట్టణాన్ని పరిశుభ్రం చేయాలని సూచించారు. మొత్తం 36 వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును సమీక్షించానని, అధికారుల పనితీరు బాగుందని ఆయన అన్నారు. ఆర్మూర్ పట్టణంలో మిగిలిన 270 పనులు రేపటి నుంచే షురూ అవుతాయని, యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు.

వేగానికి కళ్లెం



వాహనాలు వెళ్తున్న వేగాన్ని చూపుతున్న స్పీడ్ బోర్డు

- భిక్కనూర్ వద్ద హైవేపై స్పీడ్ బ్యాక్ బోర్డు
- ఎంత వేగంగా వెళ్తున్నామో అప్పటికప్పుడు బోర్డుపై ప్రదర్శన
- హై స్పీడ్‌లో వెళ్తే రెడ్‌లైట్‌తో అలెర్ట్
- వేగాన్ని చూసి కంట్రోల్ అవుతున్న వాహనదారులు



నవతెలంగాణ-భిక్కనూర్

జాతీయ రహదారిపై అతి వేగంగా వెళుతున్న వాహనాల స్పీడును కంట్రోల్ చేయడానికి కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలో 44వ జాతీయ రహదారిపై టోల్ ప్లాజా దాటిన తర్వాత డివైడర్ మధ్యలో స్పీడ్ బ్యాక్ బోర్డును ఇటీవల పోలీసులు ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి స్పీడ్ బ్యాక్ బోర్డును ప్రారంభించిన విషయం తెలిసిందే. స్పీడ్ బ్యాక్ బోర్డు ఏర్పాటు చేసిన నుండి జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలు ఎంత వేగంగా వెళ్ళుతున్నదో స్పీడ్ బ్యాక్ బోర్డ్ సెన్సార్ ద్వారా బోర్డులో కనిపిస్తుంది. దీంతో 80 స్పీడ్ దాటిన వాహనాలకు రెడ్‌లైట్ రావడంతో వాహనాదారులు స్పీడ్‌ని తగ్గిస్తున్నారు. వాహనాలు నడుపుతున్న సమయం లో స్పీడ్‌ను గమనించకుండా అతి వేగంగా వెళ్లి ప్రమాదాలకు కారణం అవుతున్న సమయంలో జిల్లా పోలీసులు స్పీడ్ బ్యాక్ బోర్డ్ ఏర్పాటు చేయడం ద్వారా తమ వాహనాల స్పీడును స్పీడ్ బ్యాగ్ బోర్డ్ లో చూసుకొని వాహనాల స్పీడ్‌ను కంట్రోల్ చేసుకొని ప్రమాదాలు, వాహన దారులకు జరిమానాలు దించకుండా వాహనాల స్పీడు సూచిక బోర్డును ఏర్పాటు చేయడం పట్ల వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఇష్టం వచ్చినట్లు జరిమానా విధిస్తున్నారు అని నిందలు వేసే వారికి స్పీడ్ బ్యాక్ బోర్డ్ ఒక సూచికగా ఏర్పడుతుందని, వాహనాలు తమ కంట్రోల్‌లో లేకుండా అతివేగంగా వెళ్లి ప్రమాదాలకు కారణం కాకుండా ఉండడానికే స్పీడ్ బ్యాక్ బోర్డును ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలుపుతున్నారు. త్వరలోనే స్పీడ్ బ్యాక్ బోర్డ్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం చేయనున్నట్లు సమాచారం. వేగంగా వెళ్తున్న వాహనాలకు బోర్డు ద్వారానే చలాన్‌లు విధించనున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

అధిక వేగం తగ్గించడానికి..

ఎస్ఐ ఆనంద్‌గౌడ్



జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న కారణంగా వాహనాల స్పీడ్ కంట్రోల్ చేయడానికి స్పీడ్ బ్యాక్ బోర్డ్ ఏర్పాటు చేశాం. తద్వారా స్పీడు తగ్గించి వెళ్లడం కారణంగా ప్రమాదాలు జరగకుండా ఉంటుంది. దీని ద్వారా ఎంత వేగంగా వెళ్తున్నామో వాహనదారుల దృష్టికి తీసుకెళ్లగలుగుతున్నాం. తద్వారా బండి వేగం తగ్గించి నడిపే అవకాశం ఉంది.

స్పీడ్ తగ్గించి వెళ్తున్నాం

కారు డ్రైవర్ సంతోష్.



స్పీడ్ బ్యాక్ బోర్డ్ ఏర్పాటు చేయడం కారణంగా స్పీడు తగ్గించి వాహనాలను నడుపుతున్నట్లు కారు డ్రైవర్ సంతోష్ తెలిపారు. ఏ వాహనం ఎంత స్పీడ్ గా వెళ్లినా స్పీడ్ బ్యాక్ బోర్డులో ఏర్పడుతుంది. దీంతో వాహనదారులకే ఒక హెచ్చరికలాగా కనిపిస్తుంది. దీంతో వాహనాల వేగం తగ్గించుకుంటున్నారు. తమ వాహనాలను కంట్రోల్ చేసుకుంటున్నామని స్పీడ్ బ్యాక్ బోర్డ్ ఏర్పాటు చేయడం పట్ల సంతోషంగా ఉందని తెలిపారు.

ప్రమాదం అంచున ఇండికేటర్ లైట్



ఒరిగి ప్రమాదకరంగా మారిన సిగ్నల్ స్తంభం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ శివారులో 44వ జాతీయ రహదారిపై జాతీయ రహదారి సంస్థ ఏర్పాటు చేసిన ఇండికేటర్ లైట్ ప్రమాదపు అంచున ఉంది. భిక్కనూర్ నుండి కామారెడ్డి వైపు వెళ్తున్న సమయంలో డివైడర్ వద్ద ఏర్పాటు చేసిన సోలార్ ఇండికేటర్ వంగి ఉన్న కారణంగా అది ఎప్పుడు పడుతుందో తెలియకుండా ప్రమాదకరంగా మారింది. మూలమలుపు వద్ద వాహనదారులు నెమ్మదిగా వెళ్లడానికి జాతీయ రహదారి సంస్థ ఇండికేటర్‌ను ఏర్పాటు చేసింది. గుర్తు తెలియని వాహనం ఢీకొన్న కారణంగా ప్రస్తుతం ఇండికేటర్ వంగి ఉంది. నిత్యం జాతీయ రహదారిని పరిశీలిస్తున్న రహదారి పర్యవేక్షకులు దాన్ని బాగు చేయడం లేదు. ప్రమాదం జరిగి స్పందించే కన్నా ప్రమాదం అంచున ఉన్న ఇండికేటర్‌ను బాగు చేయాలని వాహనదారులు కోరుచున్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఎన్నిక



జిల్లా కమిటీకి సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీని ఆదివారమిక్కడ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా రుసేగం భూమయ్య ఎన్నికైయ్యారు. ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సలేంద్ర బాబురావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొట్టిగిని శంకర్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులకు సన్మానించారు. ఈసందర్భంగా భూమయ్య మాట్లాడుతూ తన మీద ఉన్న నమ్మకంతో అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు తనవంతు బాధ్యతగా పని చేస్తానని అన్నారు. మాదిగలకు ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే వారికి న్యాయం జరిగేలాగా తన వంతుగా పోరాటాలకు ముందు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, అధికార ప్రతినిధి రామస్వామి, ఉపాధ్యక్షులు కాశీరాం, అంజయ్య, చందు, కోశాధికారి దాకయ్య ప్రచార కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి పోచయ్య, పట్టణ అధ్యక్షులు సలేంద్ర సాయి ,జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎల్లవ్వ , సీనియర్ నాయకులు పోచీరం. కామారెడ్డి ఇన్చార్జి బొట్టు శీను, ఎల్లారెడ్డి ఇంచార్జ్ కాశీరాం, బాన్సువాడ ఇన్చార్జి దాకయ్య, జుక్కల్ ఇన్చార్జి భూమయ్య, కార్యవర్గ సభ్యులు రమేష్, కిరణ్, సుభాష్, శంకర్, ఎమ్మార్పీఎస్ టిఎస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

పైప్‌లైన్ పనులు చేపట్టాం : పెద్దగుల్ల సర్పంచ్



కొనసాగుతున్న పైప్‌లైన్ పనులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దగుల్లాలో తాగు నీటీ సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం సర్పంచ్ రుక్మిని బాయి విఠల్ పటేల్ నూతన పైప్‌లైన్ పనులను ఆదివారం ప్రారంభించినట్టు జేపీఎస్ నందు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని హనుమాన్ మందిరం నుండి అంగన్ వాడి కేంద్రం వరకు ఉన్న పాత పైప్‌లైన్ తరుచు లీకేజీ సమస్యలు వచ్చేవని తెలిపారు. రోబోయేది ఎండకాలం కావున ముందస్తుగా జీపీ దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చేసేందుకు గ్రామ పంచాయతీ నిధులతో వంద మీటర్లు నూతన పైప్‌లైన్ పనులను చేపడుతున్నామని, ఇక నీటి సమస్య ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, విండో డైరెక్టర్ విఠల్ పటేల్, జేపిఎస్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ నాయకుల పాదయాత్ర

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలో డీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రను ప్రారంభించారు. మండల నాయకులు ఆదివారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి 10 కిలో మీటర్ల పాదయాత్ర ప్రారంభించారు. ఈపాదయాత్ర ధర్పల్లి మీదుగా గోవింద్ పల్లి, రామడుగు వరకు కొనసాగనుందని తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ మహారాజ్ మాట్లాడుతూ.. డీఎస్పీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ తెలంగాణ రాష్ట్రంలోని 90శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అణగారిన కులాల ప్రజలు రాష్ట్రంలో ఎదుకర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కేవలం రాజ్యాధికారం ద్వారానే సాధ్యమవుతుందని డీఎస్పీ పార్టీ స్థాపించారన్నారు. గ్రామా గ్రామాన ప్రజలకు వారి హక్కులను తెలియ చేస్తు విశారధన్ మహారాజ్ రాష్ట్రంలో చేపడుతున్న 10 వేల కిలోమీటర్ల పాదయాత్ర నేటికీ 7 వేల కిలోమీటర్ల పాదయాత్ర పూర్తయిందన్నారు. వారికీ సంఘీభావం మండలంలో 10 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా విద్యాసాగర్, మహిపాల్, కిషన్, నవీన్, గంగాధర్, రఘు, పసుల గంగాధర్, నర్సయ్య, నితిన్, మండలంలోని బిసి, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ సంఘాల ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఉన్నా లేనట్టే

- గాంధారిలో శిథిలావస్థకు చేరడంతో
- ఊరికి దూరంగా తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు
- దూరాభారంతో నిరుపయోగంగా మారిన లైబ్రరీ



శిథిలావస్థకు చేరడంతో మూసివేసిన గ్రంథాలయం

నవతెలంగాణ-గాంధారి

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలుగా అభివర్ణిస్తారు. అలాంటి గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేయాల్సి ఉండగా.. మరింత దూరం చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

గాంధారి మండల కేంద్రంలోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏడాది క్రితం ఏర్పాటు చేశారు. గ్రామానికి దూరంగా ఉండటంతో పాఠకులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులతో పాటు ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రంథాలయానికి నూతన భవనం నిర్మిం చాలని, అంత వరకు వీడీసీ భవనం ఏర్పాటుచేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థి సంఘాలు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి తాత్కాలికంగా వీడీసీ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, దీంతో పాటు నూతన భవనాన్ని సకాలంలో నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని పాఠకులు కోరుతున్నారు.

ఎవరూ వెళ్లలేకపోతున్నారు

వెల్లుట్ల సాయిలు. ఉపాధ్యాయుడు



గ్రంథాలయాన్ని గ్రామానికి దూరంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయడంతో గ్రామంలోని పాఠకులకు నిరుద్యోగులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. గ్రంథాలయం గ్రామానికి దూరంగా ఉండడంతో ఎవరు వెళ్లలేకపోతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో ఏర్పాటు చేస్తే అందరికి గ్రంథాలయం అందుబాటులో ఉంటుంది.

పాతభవనం స్థానంలో కొత్తది కట్టాలి

నితిన్ పాటిల్ గాంధారి



పాత భవనాన్ని కూల్చేసి అదే స్థానంలో కొత్త భవనాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం లిఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది గ్రంథాలని కోరుకు దూరంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయడంతో గ్రామంలోని యువకులకు విద్యార్థులకు నిరుద్యోగులకు పాఠకులకు తీవ్ర ఇబ్బందిగా ఉందని ఆయన తెలిపారు.

25న మెగా రక్తదాన శిబిరం

- తలసేమియా బాధిత చిన్నారుల కోసం దాతలు స్పందించాలని పిలుపు

నవతెలంగాణ-లింగంపేట్

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం పర్మల్ల జడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 25వ తేదీన (బుధవారం) మెగా రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు భారత్ కిసాన్ సంగ్ డివిజన్ అధ్యక్షులు మర్రిపల్లి రాజా గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 09 గంటల నుండి మధ్యాహ్నం 02 గంటల వరకు శిబిరం కొనసాగించనున్నట్టు తెలిపారు. కావున ఈ రక్తదాన శిబిరంలో రక్తదానం చేసి ఈ చిన్నారుల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు.

రాష్ట్ర వ్యాప్తంగా 3,500 మంది పిల్లలు తల సేమియా వ్యాధితో బాధపడుతున్నారని, వారికి ప్రతి 15 నుండి 20 రోజులకు ఒకసారి ఒక యూనిట్ రక్తాన్ని ఎక్కించవలసి వస్తుందని తెలిపారు. అలాంటి పిల్లల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఒక చిన్నారిని 20 రోజులపాటు బతికించే అవకాశం మనకు కలుగుతుందని, అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పది మానవతా దృక్పథంతో, సహృదయంతో స్పందించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. వైద్య శిబిరంపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు



విజేత జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందజేత

నవతెలంగాణ-తాడ్వాయి

క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పీఆర్టీయు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి అన్నారు. తాడ్వాయి మండలం కన్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల కబడ్డీ టోర్న మెంట్ ముగింపు కార్యక్ర మంలో పాల్గొని మాట్లా డారు. విద్యార్థులకు, యువతకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. క్రీడలతో మంచి నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. క్రీడలు సుదూర ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందిస్తాయన్నారు. యువకులు, విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రావీణ్యం సంపాదించి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.

ఎంపీపీ కౌడీ రవి మాట్లాడుతూ.. గ్రామంలో జూకంటి లచ్చయ్య గారి సాయిరెడ్డి స్మారకార్థం కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సాయిరెడ్డి కుమారులు ఎన్ఆర్ఐ సుధాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి క్రీడలు నిర్వహించి యువతకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. క్రీడల్లో ముప్కాల్ ప్రథమ బహుమతి రూ 50 వేలు , బొల్లారం ద్వితీయ బహుమతి రూ. 25 వేలు, బ్రాహ్మణపల్లి తృతీయ బహుమతి రూ 10 వేలు గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాధా, మార్కెట్ కమిటీ చైర్మన్ పులగం సాయి రెడ్డి, నాయకులు కిష్టారెడ్డి, వెంకటరెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002-03 సంవత్సరపు పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు రామచంద్రం, శ్రీనివాస్, కల్పన, కాశీనాథ్, శ్రీనివాస్ లను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ తోటి పూర్వ విద్యార్థులకు ఏ ఆపద వచ్చిన అండగా ఉంటామని, తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఎల్‌వోసీ అందజేత



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలంలోని నందివాడ గ్రామానికి చెందిన మాలజంగం గంగాధర్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురవ్వగా.. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. కాగా ట్రీట్మెంట్‌కు లక్షల్లో ఖర్చవుతాయని చెప్పడంతో ఎమ్మెల్యే సురేందర్ దృష్టికి తీసుకెళ్లగా.. నిమ్స్ హాస్పిటల్‌లో అడ్మిట్ చేపించి సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షలు ఎల్‌వోసీ అందజేశారు. సకాలంలో స్పందించి ఎల్‌వోసీ అందజేయించిన ఎమ్మెల్యే సురేందర్‌కు గంగాధర్ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాటిపాముల రాజగౌడ్, పార్టీ అధ్యక్షులు రాజయ్య ముక్కు సాయలు, ఈశ్వరయ్య లింగం ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం



ఒక్క చోట చేరిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆదివారం నగరంలోని శ్రావ్య గార్డెన్‌లో నాందేవాడ రావూజీ సంఘం ఉన్నత పాఠశాల 1991-92 బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థులు కలుసుకొని తమ తీపి గుర్తులను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా తమ గురువు లను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో బాలేరావు, శ్రీనివాస్, బైరి రమేష్, దుబ్బ వెంకట్, గోపాల్, శ్రీనివాస్, సంధ్య పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘ భవనానికి భూమి పూజ

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని చే పూర్ గ్రామంలో ఆదివారం నాయక పోడు సంఘం భవన్ నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి నిధుల నుండి 5 లక్షలు మంజూరు చేశారని సర్పంచ్ ఇందూరు సాయన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గ్రామ గ్రామం అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నడుకుడ శ్రీనివాస్, వార్డు సభ్యులు, నాయకపోడు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

26న వాహనాల ర్యాలీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రైతు ఐక్య ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వ ఇచ్చిన హామీలు అమలుకై జనవరి 26న జిల్లా కేంద్రంలో జరిగే వాహనాలు ర్యాలీని జయప్రదం చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పిలుపు ఇచ్చారు. ఆదివారం కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో ర్యాలీ సీపీఐ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు గంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అడిగే రాజేశ్వర్, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భాస్కర్, జేఏసీ నాయకులు భాస్కర్, అఖిలభారత రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వై.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలమధ్య కుల, మత చిచ్చుపెడుతున్న ప్రభుత్వాలు

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కే.వై.రత్నం
- పౌర హక్కుల సంఘం (సిఎల్సి)
- నిజామాబాద్ జిల్లా 16వ మహాసభ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వాలు ప్రజలమధ్య కుల, మత చిచ్చుపెడుతున్నాయని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కే.వై.రత్నం అన్నారు. పౌర హక్కుల సంఘం (సిఎల్సి) నిజామాబాద్ జిల్లా 16వ మహాసభ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ముందుగా హక్కుల ఉద్యమంలో అమరులకు నివాళి అర్పించారు. అనంతరం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కే.వై.రత్నం మాట్లాడుతూ రాజ్యాంగ చట్టాల ద్వారా మానవునికి హక్కులు సంక్రమించాయన్నారు. ప్రభుత్వాలు వీటిని గౌరవించడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ, ప్రజల జీవించే హక్కును, భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తున్నాయన్నారు. చట్టాలను ప్రభుత్వాలు ఉల్లం ఘిస్తుంటే న్యాయస్థానాలు కళ్లప్పగించి చూస్తున్నాయన్నారు. వీటన్నింటినీ ప్రజలే ప్రశ్నించాలన్నారు. ప్రశ్నించే గొంతులకు అండగా నిలవాలన్నారు. ప్రభుత్వాలు ప్రజల మధ్య కుల, మతోన్మాద చిచ్చుపెట్టి చలిమంటలు కాల్చుకుంటుందని ఆరోపించారు. సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నాయన్నారు. సమాజంలో దోపిడీ, పీడన, అణచివేత ఉన్నంతకాలం ఉద్యమించే ప్రజలు ప్రశ్నించే గొంతులు ఉంటాయని, ఇది చారిత్రక సత్యమని అన్నారు. పౌర హక్కుల సంఘం (సిఎల్సి) రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ భారత ఫాసిస్టు పాలకవర్గం ఉపాలాంటి నల్ల చట్టాలను ప్రయోగించి మనిషి మెదడును బంధించే చర్యలు చేస్తుందన్నారు. మనిషి జీవించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛకో సం పౌర హక్కుల సంఘం 1973లో ఏర్పడిందన్నారు. రాజ్య హింసకు వ్యతిరేకంగా పోరాడుతూనే, స్త్రీలపై జరుగుతున్న హింస అనిచివేత, వివక్షతలకు వ్యతిరేకంగా, వారి హక్కుల కోసం పోరాడుతుందన్నారు. ఆధిపత్య కులాలు అణగారిని కులాలపై చేస్తున్న హింస, అనిచివేతలకు వ్యతిరేకంగా, పర్యావరణ విధ్వంసానికి



మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ రత్నం

వ్యతిరేకంగా పోరాడు తుందన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు, రాష్ట్ర నాయకులు వి.సంఘం, జిల్లా అధ్యక్షులు ముప్వ నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్గోట్ రవీందర్ మాట్లాడారు. పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొంగర శ్రీనివాసరావు, భూమన్న, సహాయ కార్యదర్శులు జలంధర్, బీక్ సింగ్, ప్రవీణ్ మరియు వివిధ ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకుకోవాలి

ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనాధ పిల్లల పూర్తిగా ఆదుకుంటామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కు ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో ఆదివారం ఆయన స్వగృహం వద్ద వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్, ఎంఎస్‌పి జిల్లా ఇన్చార్జి గంధమాల నాగభూషణం మాట్లాడుతూ.. 2015లో అనాథ పిల్లల బాధ్యతను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పిన సీఎం కేసీఆర్ హామీని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. పోయిన ఏడాది కేటీఆర్ నేతృత్వంలో మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేసిన అనాథ పిల్లలకు ఎటువంటి ప్రయోజనం జరగలేదని అన్నారు. అనాధ పిల్లలకు 5శాతం రిజర్వేషన్ కల్పించాలని, వారికి ఆధార్ కార్డు, స్మార్ట్ కార్డులు, అనాధ మానసిక వికలాంగులకు పెన్షన్ ఇవ్వాలని ముఖ్య మంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ రూరల్ కన్వీనర్ శ్యామ్ మాదిగ, ఎమ్మెస్ వి నాయకులు శ్రీరాములు మాదిగ, మహిళ సమాఖ్య నాయకురాలు యమున మాదిగ, శ్రీనివాస్ మాదిగ, సుధ మాదిగ, మోపల్ మండల కన్వనర్ మనోహర్ మాదిగ, రాజు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రయాన్‌పల్లికి మాజీ ఎమ్మెల్సీ రాక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని చంద్రాయాన్ పల్లి గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చెవుల మల్లయ్య తండ్రి కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. మల్లయ్య కుటుంబాన్ని పమర్శించడానికి మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నిజామాబాద్ రూరల్ నియోజవర్గ ఇన్చార్జి డాక్టర్ భూపాతి రెడ్డి సోమవారం చంద్రాయన్ పల్లి గ్రామనికి వస్తున్నారని ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ ఆదివారం విలేకరులకు తెలిపారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసహాయం

నవతెలంగాణ-బోధన్



చికిత్స పొందుతున్న చిన్నారి

చిన్నారి వైద్యానికి ఓవ్యాపారి ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. బోధన్‌కు చెందిన సిర్ప సుమలత వినయ్ దంపతులకు మూడురోజుల క్రితం జన్మించిన బాబుకి గుండె సంబంధ సమస్య రావడంతో చిన్నారి బాబుకు అత్యవసర శస్త్ర చికిత్స కోసం హైదరాబాద్ లోని రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ లో చికిత్స కోసం చేర్పించారు. ఆపరేషన్ కోసం సుమారు 4.50లక్షల వరకు ఖర్చు అవుతుండడంతో నిరుపేద కుటుంబం చిన్నారి వైద్యం కోసం దాతలు ఆదుకోవాలని వారు కోరుతున్నారు. స్పందించిన ప్రణబ్ చౌదరి అనే వ్యాపారవేత్త 89వేలు విరాళం అందించారు.

డివిజన్ అభివృద్ధికి పోరాటాలకు సన్నద్ధం కావాలి : సీపీఐ



మాట్లాడుతున్న ఓమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని ఒకటవ డివిజన్ అభివృద్ధికి పోరాటాలకు సన్నద్ధం కావాలి సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, నగర ఇంచార్జ్ వై.ఓమయ్య అన్నారు. ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వై.ఓమయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. 30 ఏండ్లుగా ఖానాపూర్ ప్రాంతంలో గల భాగ్యనగర్, విఠలేశ్వర నగర్ కాలనీ ఏర్పాటైన నేటికీ రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించలేదని అన్నారు. మురుగునీరు రోడ్లపై పారుతున్న పట్టించుకునే నాధుడు లేడన్నారు. నకర అభివృద్ధికి వంద కోట్ల నిధులు వచ్చాని మాటల్లో చెబుతున్న ఎక్కడ అభివృద్ధి కనబడటం లేదని అన్నారు. పార్టీ ఒకటవ డివిజన్ నూతన కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ అభివృద్ధికి పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒకటొక డివిజన్ కార్యదర్శిగా జి.రమేష్, సభ్యులుగా రవి, శోభ, సురేష్, వెంకట్, యాదయ్య, ప్రసాద్, అనిల్, సంతోష్ గౌడ్, గణేష్, రాజు, శ్రీశైలం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వెల్‌నెస్‌ను మార్చినందుకు కృతజ్ఞతలు

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావుల

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈజెహెచ్ఎస్ పరిధిలోని వెల్నెస్ సెంటర్‌ను ప్రభుత్వ ఆస్పత్రి నుండి అన్ని వసతులతో కూడిన నాల్కల్ రోడ్డు లోని ఇఎస్ఐ ఆసుపత్రికి మారుస్తూ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఉత్తర్వులు జారీ చేయడంపట్ల తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో సుందరీకరణ కోసం వెల్‌సెంటర్ ఉన్న భవనం కూల్చడంతో దీన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగవ అంతస్తులో ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ ఉండడంవల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఈ నేప థ్యంలో రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు, అత్యధికంగా ఉపయోగించు కుంటున్న ఈ వెల్నెస్ సెంటర్‌కు కావలసిన మందులు, స్పెషలిస్ట్ డాక్టర్లను నియ మించాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్.మదన్మోహన్ కోశాధికారి ఈ.వీఎల్. నారాయణ, జిల్లా నాయకులు శిర్ప హనుమాన్లు, అందే సాయిలు, ఎస్. ప్రసాదరావు, ముత్తారం నరసింహస్వామి, లావు వీరయ్య, భోజరావు, పురుషోత్తం , లింగయ్య శంకర్, లక్ష్మీనారాయణ, రాధా కిషన్ ఉన్నారు.

ఇంటర్మీడియట్ మండల్ టాపర్‌కు సత్యశోధక్ పురస్కారం

నవతెలంగాణ-సిరికొండ



పురస్కారం అందజేస్తున్న సత్యసోధక్ చైర్మన్ నర్సయ్య

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువులో రాణించాలని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆర్. నర్సయ్య సూచించారు. ఆదివారం సత్యశోధక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ 2022 సిరికొండ మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థికి సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రావుట్ల చిన్న నర్సయ్య స్మారక నగదు, ఉత్తమ విద్యార్థి పురస్కారం అందించారు. చీమన్‌పల్లి గ్రామానికి చెందిన ఏనుగు బాపురెడ్డి, పద్మల కుమారుడు ఏనుగు వెంకటేష్ స్థానిక కామధేను జూనియర్ కళాశాలలో చదివి 965/1000 మార్కులు సాధించి సిరికొండ మండల్ టాపర్‌గా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ..... ఇష్టపడి చదివి, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఉన్నత లక్ష్యం నిర్దేశించుకొని, విలువైన సమయాన్ని వృధా చేయకుండా పట్టుదల, క్రమశిక్షణతో చదువులలో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, రాజేశ్వర్ గౌడ్, శంకర్,రవి, లింగం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమేష్, సత్యానంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 317 జీ.వో. ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు న్యాయం జరగాలని శాంతియుతంగా నిన్న డీఎస్ఈ వద్ద చేపట్టిన మౌనదీక్ష సందర్భంగా అరెస్టు చేయడమే కాకుండా సమస్యలను విన్నవించే సమయంలో ఉపాధ్యాయులతో విద్యాశాఖ సంచాలకులు వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు హైదరాబాద్ లోని ప్రగతిభవన్ కి వెళ్తున్న క్రమంలో ఎక్కడికి అక్కడ అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులందరిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో తమ స్థానికత కోసం మళ్ళీ పోరాటం జరగటం శోచనీయమని తెలిపారు. అన్యాయం జరిగినప్పుడు నిరసన, పోరాటం చేయడం అనేది హక్కు అని దానిని గుర్తించాలని 317 జీవో ద్వారా నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇప్పుడు జరగబోయే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్లో భాగంగా పదోన్నతుల ద్వారా ఏర్పడిన ఖాళీలతోపాటు అంతకంటే ముందు ఉన్న ఖాళీల్లో దామాషా ప్రకారం ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించే విధంగా ఉత్తర్వులు ఇస్తూ వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు జీరో సర్వీసును పరిగణలోకి తీసుకొని ప్రస్తుత బదిలీల్లో అన్ని స్థానాలను ఖాళీలుగా చూపిస్తూ అందరికీ బదిలీకి అవకాశం ఇవ్వాలని తెలిపారు.

అధ్వాన్నంగా ప్రధాన రహదారి



నవతెలంగాణ-మోపాల్

సిర్పూర్, న్యాల్‌కల్ గ్రామ ప్రజలు మోపాల్ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. నిత్యం వందలాది ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. ఇప్పటికే చాలామంది ప్రమాదానికి గురయ్యారు. అంతే కాకుండా ఇదే రోడ్డుమీదుగా మూగ జీవాలను మేపడని తీసుకెళ్తారు. చెరువు కట్ట మీద రోడ్డు చిన్నదిగా గుంతలతో ఉండడం వల్ల పశువులు వస్తున్న సందర్భంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డును మరమ్మతులు చేపట్టి ప్రయాణికులు, ప్రజల సమస్యలను తీర్చాలని కోరుతున్నారు.


ప్రజాసమస్యలు తీర్చడమే అవార్డులు

జిల్లా అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉద్యోగరిత్యా పతిరోజు ఒక సవాలుగా స్వీకరించి ముందుకు వెళుతూ ప్రజల సమస్యలు తీరుస్తూ వారు సంతోషించినప్పుడే దే అవార్డు రివార్డులుగా స్వీకరిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు. నిజామాబాద్ నగరంలోన ఓ ఇంటర్నేషనల్ హోటల్లో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో వృత్తితోపాటు పరోక్షంగా సమాజానికి సేవ చేస్తున్న ప్రముఖులకు ఒకేషనల్ ఎక్సలెంట్ సర్వీస్ అవార్డులను ప్రదానం చేశారని క్లబ్ అధ్యక్షులు సతీష్ షాహ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అవార్డు గ్రహీతగా నిజామాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, గౌరవ అతిథిగా అవార్డు గ్రహీతగా నిజామాబాద్ డివిజన్ ఏసిపి వెంకటేశ్వర్ ఆరే హాజరయ్యారని క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. రోటరీ అంతర్జాతీయ స్థాయి లో పోలియో నిర్మూలనలో విశేష కృషిచేసిందన్నారు. ఇప్పుడు ప్రధాన కార్యక్రమంగా అక్షరాస్యత వైపు కార్యాచరణలను మొదలుపెట్టిందని తెలిపారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సేవా కార్యక్రమాలతో ప్రభుత్వానికి ప్రజలకు ప్రత్యక్షంగా పరోక్షంగా అవసరమైన సమయంలో ఆదుకుంటుందని అభినందనలు తెలిపారు. అనంతరం గౌరవ అతిథి నిజామాబాద్ డివిజన్ ఏసీపీ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం 24 గంటలు ప్రజల సంరక్షణకు పనిచేస్తామని ప్రజలు ఆనందంగా ఉన్నప్పుడే నిజమైన సంతోషాన్ని ఇచ్చినట్లు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి మండల రెవెన్యూ ఆఫీసర్ పి శ్రీనివాసరావు, అపూర్వ పాఠశాల కరస్పాండెంట్ జి కుసుమలత రెడ్డి కి అలాగే డిస్టిక్ సైన్స్ ఆఫీసర్ కె గంగా కిషన్‌కు మెమెంటోలు శాలువలో పూల మొక్కలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు కోశాధికారి డాక్టర్ డి హరిష్ స్వామి, కార్యక్రమ కార్య నిర్వహణ అధికారి వి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు ధర్మపురి సురేందర్, ఇంగు రాజేశ్వర్, తులసీదాస్ పటేల్, ఆకుల అశోక్, దర్శన్ సింగ్ సోకి, జ్ఞాన ప్రకాష్, గోపాల్ జవహర్, వీరేంద్ర పరమార్ రమేష్ గుప్తా కమల్ ఇనాని విజయరావు, ఎన్. ప్రసన్న కుమారి, ఇందూరి శ్రీనివాస్, శనిశెట్టి శ్రీనివాస్ రామకృష్ణ, పి.రాజేశ్వర్ మనోజ్ పటేల్, వాసుగౌడ్, గురుప్రీత్ సింగ్, భారత్ పటేల్, అర్చకులు చిరంజీవి ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ




క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పద్మశాలి సంఘం 5 తర్ప రాంనగర్‌లో ఆదివారం 2023 సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. తర్ప అధ్యక్షులు కట్కం నరేందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శి బోగ గంగాధర్, కోశాధికారి పెంట పురుషోత్తం, పట్టణ సంఘం ప్రతినిధి ఆడెపు ప్రభాకర్, ఉపాధ్యక్షులు గోరిటాల శ్రీనివాస్, సైభ సుదాకర్, సహాయకార్యదర్శులు గెంట్యాల గణేశ్, కొండ గంగాధర్, సాంస్కృతిక కార్యదర్శి సదమస్తుల సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి పట్వారి తులసి కుమార్, సలహాదారులు కొక్కుల సుధాకర్, చౌకె లింగం, బొల్లవత్రి భూమేశ్వర్, గుద్దేటి రమేశ్, కార్యవర్గ సభ్యులు క్యాతం లక్ష్మణ్, గోగుర్ల నరహరి, బొట్ల నాగరాజు, రుద్ర రాజేష్,అలిశెట్టి రఘు, బొద్దుల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

నవతెలంగాణ-బోధన్

బోధన్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ బోధన్ బార్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాటికి ఈ దీక్షలు 35 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో న్యాయవాదులు అర్జున్ రండర్, దత్తత్రి కులకర్ణి, పల్దే శంకర్, న్యాయవాదుల గుమస్తా అన్వర్ అలి దీక్షలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో న్యాయవాదులు . అడ్లురి శ్రీనివాస్ ,శంకర్ ,హన్మంతు రావు,నాయక్ సాయిలు,ధర్మయ్య, న్యాయవాదుల గుమస్తా సంఘం అధ్యక్షులు గంగాధర్, జమీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయింది

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పాతూరి మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఉపాధ్యాయ ఉద్యమం ఒక గొప్ప నాయకున్ని కోల్పోయిందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు పాతూరి మహేందర్ రెడ్డి అన్నారు. టీపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు బానోత్ దేవీసింగ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా స్మారక సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవిసింగ్ ఉపాధ్యాయ ఉద్యమం లో నిజాయితీగా, నిబద్ధతతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడారని అన్నారు. ఇలాంటి వ్యక్తిని కోల్పోవడం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని నష్టమని అన్నారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్ల సత్యనారాయణ మాట్లాడుతూ... నమ్మిన సిద్ధాంతంకోసం చివరి వరకు నైతిక విలువలతో కలిగి ఉన్నారని అన్నారు.

జిల్లా ఉపాధ్యక్షులు కేసి లింగం మాట్లాడుతూ.. దేవిసింగ్ లాంటి ధైర్యం, ఉన్నత విలువలున్న వ్యక్తులు సమాజంలో దొరకడం చాలా అరుదని అన్నారు. టీపీటీఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కె.రమణ మాట్లాడుతూ దేవిసింగ్‌తో ఉద్యమంలో 20 ఏళ్ళు కలిసి పనిచేశానని ఆయన ఉద్యమ నాయకులకు రోల్ మోడల్ అని అన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ సీనియర్ నాయకులు టీ. హన్మాండ్లు, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.సత్యనారాయణ, అనిల్ కుమార్, భూపాల్ రెడ్డి, రాంనాథ్ రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్, డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుశాంతన్, జిల్లా కార్యదర్శి రాజన్న, బీసీటీయూ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్, ఎస్సీ ఎస్టీ యూనియన్ జిల్లా నాయకులు సుదాం, గైక్వాయిడ్, టీపీటీఎఫ్ జిల్లా నాయకులు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ప్రభాకర్ పాల్గొన్నారు.